క్లుప్తంగా

రేపటి నుంచి పింఛన్ల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో సోమవారం నుంచి వైఎస్సార్ పింఛను కానుకు పంపిణీ ప్రారంభమవుతుందని డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతి పథం ప్రాజెక్టు డైరెక్టర్ సిరిపురపు సుభాషిణీ తెలిపారు. జిల్లాలోని 2,34,718 మంది పింఛనుదారులకు ప్రభుత్వం రూ.64.70కోట్లు విడుదల చేసిందన్నారు. వేలిముద్రలు పడని అవ్వాతాతలకు ఆధార్ ముఖగుర్తింపుతోనూ పింఛను అందజేస్తామన్నారు.

ప్రముఖులకు సత్కారం



కోట సుందరరావుని సత్కరిస్తున్న సంఘ నాయకులు

సీటీఆర్ఐ: గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ జరిగి 37 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం జిల్లా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో పలువురు ప్రముఖులను సత్కరించారు. 1986 ఏప్రిల్ 29న దివంగత మాజీ మంత్రి బత్తిన సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ కాంస్య విగ్రహం ఏర్పాటు చేసి, నాటి గవర్నర్ కుముద్ బెన్ జోషి చేతుల మీదుగా ఆవిష్కరించారు. అప్పుడు ఈ విగ్రహం స్థాపనకు కృషి చేసిన కోట సుందరరావు, పాలుమాటి రామారావు, జి.వి.రమణ, ఎల్.వి.ప్రసాద్, జి.శేషగిరి రావులను ఘనంగా సత్కరించారు. కోరుకొండ చిరంజీవి, తాళ్ళూరి బాబూ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

'నవోదయ'కు 192 మంది..

కడియం: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం జరిగిన నవోదయ ప్రవేశ పరీక్షకు 192 మంది హాజరయ్యారని ఎంఈఓ వి.లజపతిరాయ్ తెలిపారు. ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులకు జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష నిర్వహించిదన్నారు. పరీక్షకు 24 మంది హాజరు కాలేదని తెలిపారు.

మహానాడు స్థలం పరిశీలన

కడియం: వేమగిరిలో జాతీయ రహదారిని ఆనుకున్న ఉన్న ప్రైవేటు స్థలంలో టీడీపీ మహానాడును నిర్వహించనున్నట్టు టీడీపీ నాయకులు తెలిపారు. ఈ మేరకు సదరు స్థలాన్ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, రూరల్, సిటీ, పెద్దాపురం ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి భవాని, నిమ్మకాయల చినరాజప్ప, మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, కిమిడి కళావెంకట్రావు, కేఎస్ జవహర్, ప్రత్తిపాటి పుల్లారావు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు తదితరులు శనివారం పరిశీలించారు. అక్కడ వచ్చే నెల 27న ప్రతినిధుల సభ, 28న భారీ బహిరంగ సభ జరుగుతాయని అచ్చెన్నాయుడు చెప్పారు.

ఒకటి నుంచి వేసవి క్రీడాశిక్షణ

ప్రకాశం నగర్: జిల్లా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో సోమవారం నుంచి జిల్లాలో 51 సెంటర్లలో 20 క్రీడాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా చీఫ్ కోచ్ డీఎంఎం శేషగిరి శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు.

ముగిసిన టైలరింగ్ శిక్షణ

కడియం: పొట్టిలంకలో 40రోజుల పాటు 40మంది మహిళలకు నిర్వహించిన కుట్టు శిక్షణ కార్యక్రమంలో శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కొత్తపల్లి సత్యవతీ వేంకటేశ్వరరావు అధ్యక్షత వహించి శిక్షణ ఏర్పాటు చేసిన హెడ్‌హెల్డ్‌హై ఫౌండేషన్, ప్రభాత్ జీవనోపాధి కేంద్రాల వారికి కృతజ్ఞతలు తెలిపారు.

రేపు మండల స్థాయి స్పందన

రాజమహేంద్రవరం రూరల్: ఖానుకుంపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మండల స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తహసీల్దార్ పి.చిన్నారావు, ఎంపీడీవో రత్న కుమారి ఒక ప్రకటనలో తెలిపారు.





అతివలదే ఆధిక్యం



ఓటు నమోదు చేసుకున్న యువతీ యువకులు

- అర్బన్, రూరల్ పరిధిలో మొత్తం ఓటర్లు 5,12,445
- అర్బన్ పరిధిలో పురుషులు 1,23,715 మంది, స్త్రీలు 1,31,864 మంది
- డిసెంబర్ నాటికి నమోదు పూర్తి

నియోజక వర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
రాజమహేంద్రవరం సిటీ	225	1,23,515	1,31,864	63	2,55,642
రాజమహేంద్రవరం రూరల్	263	1,25,642	1,31,144	17	2,56,803

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఓటు వజ్రాయుధం. ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు వేసి తనకి నచ్చిన వ్యక్తిని నాయకుడుని చేయవచ్చు. నచ్చని వక్తిని గద్దె దింపేయవచ్చు. అటువంటి శక్తివంతమైన ఓటు నమోదు కార్యక్రమంలో మహిళ ఓటర్లే అధిక సంఖ్యలో నమోదయ్యారు. 18ఏళ్లు నిండిన వారిని, 2023 జనవరి నాటికి 18 సంవత్సరాలు వస్తున్న వారిని కూడా ఓటర్లు జాబితాలో చేర్చారు. జిల్లాలో ఓటర్లు నమోదు కోసం ప్రత్యేక డ్రైవ్‌ని నిర్వహించారు. ప్రతి కళాశాలలోనూ ఓటు నమోదుకు ఎలిజిబిలిటీ ఉన్న వారందరినీ ఓటర్లు నమోదు చేయడానికి ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేశారు. కళాశాల యాజమాన్యానికి ఇందులో భాగస్వాములను చేసి వారితో ఓటర్ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. ఓటరు నమోదు పరిశీలన అధికారి పోలా భాస్కర్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ మాధవీలత బూత్ లెవెల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ 2023 భాగంగా ఫైనల్ ఓటర్లు జాబితా ప్రకారం ఫైనల్ ఓటర్ల జాబితా ప్రకారం రాజమహేంద్రవరం పరిధిలో 2,55,642 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,31,715 మంది కాగా ఈ సారి నమోదులో కూడా మహిళ ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. మహిళలు 1,31,764 మంది ఉన్నారు. ఇతరులు 63 మంది ఉన్నారు.

మహిళల్లో పెరిగిన అవగాహన

జిల్లా పరిధిలోని ఓటర్లలో పురుషులు కంటే మహిళ ఓటర్లే అధికంగా ఉన్నారు. దానికి కారణం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అన్ని సంక్షేమ పథకాలలో పెద్ద పీట వేయడం. అన్ని పథకాలలో అగ్రభాగం మహిళలకు అందించవల్ల మహిళలకు ఓటు నమోదుపై అవగాహన ఏర్పడింది. మహిళలకు 50 శాతం రిజర్వేషన్‌తో అన్ని నామినేటెడ్ పోస్టులు వర్తించేలా సీఎం నిర్ణయం తీసుకోవడంతో మహిళలో ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెరిగింది.

డిసెంబర్ నాటికి పూర్తి..

గతంలో ఏడాదికి ఒక సారి మాత్రమే ఓటర్లు నమోదు ప్రక్రియ ఉండేది. ఇప్పుడు ప్రతి నాలుగు నెలలకోకసారి ఓటర్ల నమోదు జాబితాను విడుదల చేస్తున్నారు. దీనితో ఓటర్లు నమోదు నిరంతరంగా జరుగుతోంది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఓటర్లు నమోదు, సవరణలను పూర్తి చేయాల్సి ఉండడంతో అధికారులు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు.

> **నమోదు శాతం పెరిగింది**
>
> 
>
> ఓటు హక్కుపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నాం. దీంతో ఓటు నమోదు చేయించుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది ఎక్కువ మంది మహిళ ఓటర్లు నమోదు చేసుకున్నారు. కాలేజీ స్థాయి అమ్మాయిల్లో అవగాన పెరిగి ఓటు నమోదు చేసుకోవడం వల్ల ఈ నమోదు శాతం పెరిగింది.
>
> – డాక్టర్ కె.మాధవీలత, కలెక్టర్, తూర్పుగోదావరి జిల్లా

తుది దశకు పుష్కర్ ప్లాజా పనులు



పుష్కరప్లాజా పనులు పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో జరుగుతున్న పుష్కర్ ప్లాజా పనుల్లో పూర్తి నాణ్యత ప్రమాణాలు పాటించాలని కమిషనర్ దినేష్‌కుమార్ ఇంజినీరింగ్ అధికారులకు, కాంట్రాక్టరుకు సూచించారు. శనివారం నగరపాలక సంస్థ పరిధిలో కొత్తగా రూపుదిద్దుకుంటున్న పుష్కర్ ప్లాజాను సందర్శించి, పనులను పరిశీలించారు. కమిషనర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ నగరంలో ప్రధాన ప్రాంతంగా ఉన్న పుష్కర్ ఘాట్ రైల్వే అండర్ బ్రిడ్జి పక్కన ఉన్న ఈ స్థలం నిరుపయోగంగా, జనావాసాలు లేని ప్రాంతంగా ఉండడంతో ఇలాంటి ప్రదేశాన్ని పుష్కర్ ఘాట్ వద్దకు వచ్చే పర్యాటకులకు కూర్చొనేలా తీర్చిదిద్దామన్నారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే పనులన్నీ దాదాపు తుది దశకు చేరాయని, నగర ప్రజలకు పర్యాటకులకు ఆహ్లాదకరంగా పుష్కర్ ప్లాజాను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, సంబంధిత ఇంజినీర్లు పాల్గొన్నారు.

డ్రైన్ల నిర్మాణాలపై సమగ్ర విచారణ చేయిస్తాం

- మృతుడు నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు ఎంపీ భరత్ పరామర్శ
- షిరిడీసాయి మార్గ్‌లో డ్రైనేజీ పనుల పరిశీలన



మృతుడు నాగేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: జేఎన్ రోడ్డు షిరిడిసాయి మార్గ్‌లో డ్రైన్ల నిర్మాణాలపై సమగ్ర విచారణ చేయిస్తామని ఎంపీ మార్గాని భరత్‌రామ్ పేర్కొన్నారు. ఇటీవల షిరిడీ సాయి మార్గ్ జంక్షన్ వద్ద నిర్మాణంలో ఉన్న డ్రైనేజీలో దురదృష్టవశాత్తు పడి మృతి చెందిన ఏరుకొండ నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను శనివారం ఆయన పరామర్శించి, నాగేశ్వరరావు చిత్రపటానికి నివాళులు అర్పించారు. ప్రభుత్వ పరంగా రావాల్సిన నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తానని నాగేశ్వరరావు భార్యా పిల్లలకు భరత్‌రామ్ హామీ ఇచ్చారు. అనంతరం షిరిడీ సాయి మార్గ్‌లో నిర్మాణ దశలో ఉన్న డ్రైనేజీ పనులను అధికారులతో కలసి పరిశీలించారు. ముందు రోజు అర్ధరాత్రి నుంచి వర్షం పడడం డ్రైన్లలో వర్షపు నీటితో పాటు మురుగునీరు పేరుకుపోవడంతో ఆ నీటిని మోటార్ల సహాయంతో బయటకు తోడే పనిని ఇంజినీరింగ్ సిబ్బంది చేపట్టారన్నారు. రాత్రి సమయంలో నాగేశ్వరరావు అటుగా వస్తూ పొరపాటున కాలు స్లిప్ అయి డ్రైనేజీలో పడి మృతిచెందారన్నారు. ఈ పనులు జరుగుతున్న విషయం ఈ ప్రాంత వాసులకు తెలుసని, అయినా రక్షణ ఏర్పాట్లు చేశారన్నారు. ఏదేమైనా సంఘటన చాలా దురదృష్టకరమన్నారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామన్నారు. ఈ ప్రాంతంలో డ్రైనేజీల నిర్మాణంపై సమగ్ర విచారణ జరుగుతుందని, దీని వెనుక ఎవరెవరు బాధ్యులు ఉన్నారో పోలీసులు దర్యాప్తు వెల్లడవుతుందన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ఇంటి సమీపంలో జరిగే అభివృద్ధి పనుల విషయంలో ఎందుకు శ్రద్ధ వహించలేదని ఆయన ప్రశ్నించారు. ఈ డ్రైనేజీ పనులు వచ్చే మాసాంతానికి పూర్తవుతాయని, ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఎస్ఈ పాండురంగారావు, ఈఈ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

రచ్చబండకు వినతుల వెల్లువ

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక మార్గాని ఎస్టేట్ ఆవరణలో వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రచ్చబండకు పలు అర్జీలు అందాయి. అర్జీలతో రాజమండ్రి పార్లమెంటరీ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఎంతో వ్యయప్రయాసలతో వచ్చారు. ఆ అర్జీలను ఆయన పరిశీలించి పరిష్కరించారు. పలువురు ఎంపీ భరత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వాస్తవిక కథనంతో 'ఉగ్రం' చిత్రం



సమావేశంలో మాట్లాడుతున్న హీరో అల్లరి నరేష్, చిత్రంలో హీరోయిన్ మిర్నామీనన్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వాస్తవిక కథనంతో ఉగ్రం చిత్రాన్ని తెరకెక్కించినట్టు సినీ హీరో అల్లరి నరేష్ తెలిపారు. మే 5వ తేదీన ఈచిత్రం థియేటర్లలో విడుదలవుతున్న సందర్భంగా ప్రమోషన్స్‌లో భాగంగా శనివారం స్థానిక షల్టన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాంది చిత్రం తర్వాత సీరియస్ పాత్రలతో వస్తున్నాన్నారు. కోవిడ్ సమయంలో లక్షా 60 వేల మంది కనిపించకుండా పోయారని, వారిలో సగం మంది వివరాలు మాత్రమే తెలిశాయని, మిగిలినవారు ఏమయ్యారన్న కథాంశంతో ఉగ్రం తెరకెక్కిందన్నారు. ఈ సినిమాలో సీరియస్ పోలీస్‌గా కనిపిస్తానని, మైత్రీ ఫిలింస్ విడుదల చేస్తున్న 7వ చిత్రం ఉగ్రం మంచి హిట్ అందుకుంటుందన్నారు. హీరోయిన్ మిర్నామీనన్ మాట్లాడుతూ ఇది తన రెండో చిత్రమని, 5న విడుదల అవుతున్న ఈ చిత్రాన్ని థియేటర్‌లో చూసి తమ చిత్ర బృందాన్ని ఆశీర్వదించాలని కోరారు. సమావేశంలో గోల్కొండ హైస్కూల్ ఫేం సాయి శ్రీనివాస్, మైత్రి ఫిలింస్ ఉదయ్ మాట్లాడారు.

ప్రైవేట్ పాఠశాలల్లో సీట్ల భర్తీకి 15 వరకూ గడువు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రానున్న విద్యా సంవత్సరంలో ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను రెండో విడతగా కేటాయింపు వచ్చే నెల 15వ తేదీ వరకూ ఉందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం శనివారం తెలిపారు. 2023–24లో విద్యా హక్కు చట్టం ప్రకారం రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాలు, అనాథ, హెచ్ఐవీ బాధిత, వికలాంగులు, బలహీన వర్గాలు, షెడ్యూలు కులం, షెడ్యూల్ తెగ వర్గాలకు చెందిన పిల్లలు అర్హులన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 16వ తేదీ నుంచి 20వరకూ దరఖాస్తులను పరిశీలించి, అర్హత నిర్ధారిస్తారన్నారు. 22న లాటరీ పద్ధతి, 24వ తేదీ నుంచి 28 వరకూ అడ్మిషన్లు నిర్ణయిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు ఏపీ.సీఎస్ఈ.గవ్.ఇన్ వెబ్‌సైట్‌లో చూడవచ్చన్నారు.





సీఎం జగన్ పాలనపై ప్రజల సంతృప్తి



సమావేశంలో మాట్లాడుతున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: జగనన్నే మా భవిష్యత్తు పీపుల్స్ సర్వే ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై 80 శాతం ప్రజలు సంతృప్తిగా ఉన్నారని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. శనివారం రూరల్ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చందన మాట్లాడారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఈ నెల 7వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమై శనివారంతో ముగిసిందన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ రాష్ట్రంలోని 1.45 కోట్ల కుటుంబాలను కలిసి సీఎం జగనన్న పాలనపై వారి అభిప్రాయాలను సేకరించిందన్నారు. ప్రజలందరూ మద్దత తెలిపారన్నారు. రూరల్ నియోజకవర్గంలో 1,08,361 గృహాలు వుండగా, వైఎస్ఆర్సీపీ గృహసారథులు సందర్శించిన గృహాలు సంఖ్య 92,887 ఉండగా మద్దతుగా 66,393 మిస్డ్‌కాల్స్ ఇచ్చారన్నారు. ఈసమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మింధి నాగేంద్ర, ఖాదీ బోర్డ్ వైస్ చైర్మన్ పిల్లి నిర్మల, ఇన్నీసుపేట బ్యాంకు వైస్ చైర్మన్ గేడి అన్నపూర్ణ రాజు, ఆర్యపురం బ్యాంకు డైరెక్టర్ బిల్డర్ చిన్న, హితకారిణి ట్రస్ట్ డైరెక్టర్ సరితా రాణి, జేసీఎస్ కన్వీనర్లు చక్రవర్తి, విష్ణుమూర్తి, జిల్లా ట్రేడ్ యూనియన్, దివ్యాంగులసెల్ అధ్యక్షుడు అను, పోసి కుమార్, రాజేష్, సత్యప్రియ, సుబ్బారావు, శివ, లక్ష్మి,చంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రకాశంనగర్ : వచ్చేనెల ఒకటో తేదీ నుంచి ఐదో తేదీ వరకూ తిరుపతిలో నిర్వహించబోతున్న ఏపీ సీఎం కప్పు మహిళ హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌కు ఎస్‌కేవీటీ కళాశాల విద్యార్థునులు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ రాజబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ ఫైనలియర్ చదువుతున్న కె.నందిని, టి.పుణ్యవతిలను బెస్ట్ ప్లేయర్స్‌గా శ్రీకాకుళంలో ఎంపికయ్యారన్నారు.

ధోబీఘాట్ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

రాజమహేంద్రవరం రూరల్: కాతేరులో రజకులు కోసం రూ.5 లక్షలతో దోభీఘాట్ పునర్నిర్మాణానికి శనివారం వైఎస్సార్‌సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ శంకుస్థాపన చేశారు. నాయకులు, రజకులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ విద్యార్థుల సత్తా

కంబాలచెరువు: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు తమ సత్తా చాటారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్ ప్రతిభామూర్తి శనివారం తెలిపారు. ఆలిండియా కేటగిరి విభాగంలో ఎస్.విజయరాఘవేంద్ర 69వ ర్యాంకు సాధించాడన్నారు. జీవీ శ్రీసత్యహేమేష్ 937వ ర్యాంకుతో పాటు మరో 50 మంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారన్నారు. తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులతో పాటు ఉత్తమ ఎన్ఐటీ సీట్లు సాధించే దిశగా కృషి చేస్తున్నారన్నారు. ఈ విజయాల్ని సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులను కళాశాల డైరెక్టర్ ప్రతిభ మూర్తి, అకడమిక్ హెడ్స్ శ్రీకాంత్, బాలిరెడ్డి, శ్రీధర్ అభినందించారు.

జేఈఈ మెయిన్స్‌లో ఫ్యూచర్ కిడ్స్ ప్రతిభ

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం కవలగొయ్యిరోడ్డులోని ది ఫ్యూచర్‌కిడ్స్ విద్యార్థులు శనివారం విడుదలైన జేఈఈ మెయిన్స్ పరీక్షా ఫలితాలలో అత్యున్నత ర్యాంకులను సాధించారు. దేశవ్యాప్త ర్యాంకులలో తమన్నా–ఎ–మజీద్ 99.53, లలితా అనూజ 98.54, సాహితి 94.36, ఆర్థికృష్ణ 90.83 విద్యార్థులు 90శాతానికి పైగా పర్సంటైల్ సాధించి జేఈఈ అడ్వాన్సు పరీక్షకు అర్హత సాధించారన్నారు. ప్రతిభను కనబరిచిన విద్యార్థులను చైర్‌పర్సన్ విజయమేలేటి, ప్రిన్సిపాల్ శేషగిరిధర్, డీన్ హర్షిణి అభినందించారు.



అలరించిన కోటి స్వర మహోత్సవ సినీసంగీత విభావరి



సంగీత దర్శకుడు కోటిని సత్కరిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సినీ సంగీత దర్శకులు సాలూరి కోటేశ్వరరావు(కోటి) సమక్షంలో కోటి స్వర మహోత్సవం పేరిట సినీ సంగీత విభావరి శనివారం రాత్రి శ్రీవేంకటేశ్వర ఆనం కేంద్రంలో వీనుల విందుగా సాగింది. శ్రీహరి ఈవెంట్స్ పిరాట్ల హరి నిర్వహణలో, ఉమాదేవి, సింగర్ ప్రియ పర్యవేక్షణలో సాగిన సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ రామ్, మ్యూజిక్ డైరెక్టర్ కోటి, రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిల రెడ్డి, జ్యోతి ప్రజ్వలన చేశారు. రాజమహేంద్రవరంలోని వివిధ సంగీత సంస్థలు గాయనీ గాయకులు, డా.బిక్కిన రామమనోహర్, డాక్టర్ వట్టి గంగా కిషోర్, రాజేశ్వరరావు, వడిశ లేరు బేబీ, భవ్య, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు గీతాలాపన చేశారు. కోటిని ఎంపీ భరత్ సత్కరించారు. అలాగే తేజం జలిని కోటి సత్కరించారు. ఎంపీభరత్‌రామ్‌ను గాయనిగాయక బృందం, కోటి ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు నల్లమిల్లి సూర్యకాంతం, దాదాపు 60 మంది గాయనీ గాయకులు'కోటి' స్వరమహోత్సవంలో పాల్గొన్నారు.

ఒకటి నుంచి అమ్మవారి బ్రహ్మోత్సవాలు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): శ్రీమహాలక్ష్మీ సమేత చిన్న వేంకటేశ్వరస్వామి వారి పీఠంలో వచ్చే నెల ఒకటో తేదీ నుంచి 4వ తేదీ వరకూ అమ్మవారికి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్టు గురు గోవింద డాక్టర్ శ్రీమాన్ చిన్న వేంకన్నబాబు స్వామీజీ తెలిపారు. శనివారం రాజమహేంద్రవరంలోని సువిశేషపురంలో సమితి ఉభయ రాష్ట్రాల వైస్‌చైర్మన్ తిరుమలరెడ్డి వెంకటఅప్పారావు నివాసంలో బ్రహ్మోత్సవాలు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సర్వేజనా సుఖినోభవంతు చారిటబుల్ ట్రస్టు, మనగుడి–మనసేవ భారతీయ ఆధ్యాత్మిక సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి

కంబాలచెరువు: విద్యార్థులు వేసవి సెలవులు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు తగు చర్యలు తీసుకోవాలని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సెలవుల్లో ప్రభుత్వం నిర్దేశించిన ఉయ్ లవ్ రీడింగ్ (చదువంటే మాకిష్టం) కార్యక్రమంలో పాఠశాల లైబ్రరీ నుంచి ఇచ్చే కథలు, వ్యాసాలు చదవాలన్నారు.

ఈదురుగాలులతో వర్షం

రాజమహేంద్రవరం సిటీ: అకస్మాత్తుగా మారిన వాతావరణంతో రాజమహేంద్రవరం నగర ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఈదురుగాలులకు నగరంలో విద్యుత్ స్తంభాలు, తీగలు నేలకొరిగాయి. ఈదురు గాలులకు నగరంలో సుమారు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. వేసవి ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్న ప్రజలకు అకస్మాత్తుగా మారిన వాతావరణంతో ఉపశమనం కల్పించింది. రూరల్ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయా లేదా సిబ్బంది పరిశీలన చేస్తున్నారన్నారు.

కడియం: మండలంలో శనివారం మధ్యాహ్నం ఈదురు గాలులతో వర్షం కురిసింది. వర్షానికి కళ్లాల్లో ఉన్న ధన్యాం తడిసిపోయాయి. పొలంలో పనుల చేసి తిరిగి ఇళ్లకు వెళ్లిన రైతులు, కూలీలు పరుగుపరుగున కళ్లాలకు వెళ్లి ధాన్యం తడిసిపోకుండా కాపాడుకునేందుకు నానా తంటాలు పడ్డారు. ధాన్యానికి రక్షణ ఏర్పాట్లు చేశారు.

